రైతన్నను ఆదుకుంటున్న కొబ్బరి

- సాగు విస్తరణకు ఇదే మంచి తరుణం
- ప్రత్యక్షంగా, పరోక్షంగా వేలాదిమంది ఉపాధికి దోహదం
- మార్కెట్లో అధిక ధర పలుకుతున్న టెంకాయలు



తేటగుంట ఉద్యాన క్షేత్రంలో విక్రయానికి సిద్ధంగా ఉన్న కొబ్బరి మొక్కలు



చామవరంలో కొబ్బరి మొక్కతోట

తుని రూరల్: కొబ్బరి చెట్టును పెంచుకుంటే కష్టకాలంలో కన్న కొడుకులా ఆదుకుంటుందన్న నానుడి ప్రస్తుతం బహిరంగ మార్కెట్లో టెంకాయలకు పలుకుతున్న ధరను చూస్తే నిజమేననిపిస్తోంది. శ్రవణమాసం, గణపతి నవరాత్రులు, దుర్గమ్మ నవరాత్రి ఉత్సవాల్లో పరిమాణాన్ని బట్టి ఒక్కొక్క కొబ్బరికాయ రూ.40 నుంచి రూ.60 వరకు చిల్లర ధర పలుకుతోంది. రవాణా చార్జీలు, ఇతర ఖర్చులు పోనూ రూ.23 నుంచి రూ.26 చొప్పున రైతుకు గిట్టుబాటు ధర లభిస్తోంది. వేర్వేరు అవసరాలతో కొబ్బరికి మంచి డిమాండ్ ఉందని వ్యాపారులు, అధికారులు పేర్కొన్నారు.

అంతర పంటలతో అదనపు ఆదాయం

కొబ్బరి సాగు విస్తరణపై రైతులు దృష్టి సారించేందుకు ఇదే మంచి తరుణమని ఉద్యాన అధికారులు పేర్కొన్నారు. కొబ్బరిలో అంతర పంటలకు సాగుతో అదనపు ఆదాయం లభిస్తుంది. కొబ్బరి డెవలప్‌మెంట్ బోర్డు ఆధ్వర్యంలో ఉద్యానశాఖ సాగుదారులను ప్రోత్సహిస్తూ రాయితీలు అందిస్తోంది. 2025–26 సంవత్సరం నుంచి హెక్టారులో 160 కొబ్బరి మొక్కలు నాటుకుంటే రూ.28వేలు చొప్పున రెండేళ్లు రూ.56 వేలు రాయితీ లభించనుంది.

సబ్‌డివిజనల్‌లో రెండువేల హెక్టార్లలో కొబ్బరి

సాగునీటి వసతులు లేని మెట్ట ప్రాంతం తుని ఉద్యానశాఖ సబ్‌డివిజన్‌లో ఐదు మండలాలు ఉన్నాయి. తుని, కోటనందూరు, తొండంగి, శంఖవరం, రౌతులపూడి (ఐదు) మండలాల్లో 2,100పైగా హెక్టార్లలో కొబ్బరి తోటలున్నాయి. సాగుదారులతో పాటు కొబ్బరి దింపు, ఒలుపు, కురిడి తయారీ, అనుబంధ ఉత్పత్తుల తయారీ, కొబ్బరినీరు అవసరాలకు కాయల ఎగుమతులతో వేలాది మంది కూలీలు, వ్యాపారులు ఉపాధి పొందుతున్నారు. కొబ్బరి డెవలప్‌మెంట్ బోర్డు తన కార్యకలాపాలను విస్తరిస్తుంది. అందులో భాగంగా కొబ్బరి సాగును విస్తరణను పెంచేందుకు ప్రోత్సాహకాలను అందిస్తుంది.

రాయితీపై పదివేల మొక్కలు

ఏడాది వయస్సుగల కొబ్బరి మొక్కలను రాయితీపై అందిస్తున్నాము. ఒక్కొక్క మొక్కకు రైతు రూ.60 చొప్పున చెల్లించాలి. తేటగుంట ఉద్యాన క్షేత్రంలో పదివేల మొక్కలు అందుబాటులో ఉంచాం. కనిష్ఠంగా గట్లపై పది మొక్కలు, గరిష్ఠంగా రెండు హెక్టార్లలో కొబ్బరి మొక్కలు వేసుకునే రైతులకు రాయితీలు వర్తిస్తాయి. మొక్కలకు, సాగు విస్తరణపై ఆసక్తిగల రైతులు రైతు సేవా కేంద్రాల్లో గ్రామ ఉద్యాన, వ్యవసాయ అసిస్టెంట్లను సంప్రదించి, దరఖాస్తులు చేసుకోవాలి.

– ఎన్.సుజాత,

రూ.56 వేలు రాయితీ

2025–26 ఖరీఫ్ నుంచి కొబ్బరి విస్తరణ పెంచే రైతులకు కొబ్బరి డెవలప్‌మెంట్ బోర్డు హెక్టారుకు రూ.56వేలు వేలు రాయితీని రైతులకు అందిస్తుంది. 160 కొబ్బరి మొక్కలను హెక్టారులో నాటుకుంటే రూ.28వేలు చొప్పున రెండేళ్లు రూ.56వేలు రాయితీ లభిస్తుంది. ఈ మొత్తం మొక్కలు కొనుగోలు, మొక్కలు నాటే గుంతల తవ్వకం, ఎరువుల నిర్వహణ, నీటి యాజమాన్యానికి వినియోగించాల్సి ఉంది. కనిష్ఠంగా పది మొక్కలను 25 సెంట్లలో నాటుకున్నా, గట్లపై నాటుకున్నా రైతులకు రాయితీలు అందించేందుకు అధికారులు ఏర్పాట్లు చేశారు.

క్లుప్తంగా

పాఠశాలలకు బోధనోపకరణ కిట్ల పంపిణీ



పాఠశాలలకు బోధనోపకరణ సామగ్రి కిట్లను ఉపాధ్యాయులకు అందజేస్తున్న ఎంఈఓ సతీష్‌బాబు

రౌతులపూడి: మండలంలోని వివిధ పాఠశాలలో సైన్స్ విభాగానికి సంబంధించి బోధనోపకరణ సామగ్రి కిట్లను ఎంఈఓ సతీష్‌బాబు మంగళవారం ప్రధానోపాధ్యయులకు అందించారు. ప్రభుత్వం విద్యాశాఖ ఆధ్వర్యంలో అందించే ఈ కిట్లను మండలంలోని పది పాఠశాలలకు అందజేసినట్లు ఆయన తెలిపారు. ప్రభుత్వం అందజేసిన ఈ బోధనోపకార సామగ్రిని ఉపయోగించి విద్యార్థులకు అర్థమయ్యే విధంగా మెరుగైన బోధన అందివ్వాలని ఉపాధ్యాయులకు సూచించారు. ఈ కార్యక్రమంలో ఎంఈఓ–2 గాడి కొండబాబు, పలువురు ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

పారిశుధ్యంపై దృష్టి సారించండి



కొంతంగిలో తడి చెత్త, పొడి చెత్తపై అవగాహన కల్పిస్తున్న డీఎల్‌పీఓ బాలామణి

శంఖవరం: గ్రామాల్లో పారిశుధ్యంపై పంచాయతీ అధికారులు, సిబ్బంది ప్రత్యేక దృష్టి సారించాలని పెద్దాపురం డీఎల్‌పీఓ బాలామణి సూచించారు. కొంతంగి గ్రామంలో మంగళవారం ఆమె పర్యటించారు. పంచాయతీ రికార్డులు తనిఖీ చేశారు. తడి చెత్త, పొడి చెత్త వేర్వేరుగా ఏర్పాటు చేయాలని ప్రజలకు అవగాహన కల్పించారు. సీజనల్ వ్యాధులపై అప్రమత్తంగా ఉండాలన్నారు. ఈగలు, దోమల నివారణకు చర్యలు చేపట్టాలన్నారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ ఎంపీడీఓ నాగలక్ష్మి, పంచాయతీ కార్యదర్శి సుధాకర్ పాల్గొన్నారు.

విద్యుత్ శాఖ ఉద్యోగుల ఆందోళన



జగ్గంపేటలో విద్యుత్ కార్యాలయం వద్ద ఆందోళన చేస్తున్న ఉద్యోగులు

జగ్గంపేట: విద్యుత్ ఉద్యోగులు తమ సమస్యలను పరిష్కరించాలని కోరుతూ ఆందోళన బాట పట్టారు. జగ్గంపేటలోని విద్యుత్ డీఈ కార్యాలయం వద్ద డివిజన్ జేఏసీ చైర్మన్ మురళీకృష్ణ ఆధ్వర్యంలో అన్ని యూనియన్లు, క్యాడర్లు, సిబ్బంది, జేఏసీగా ఏర్పడి నిరసన చేపట్టారు. ఈ సందర్భంగా నేతలు మాట్లాడుతూ ఉద్యోగులకు పాత పెన్షన్ విధానం వర్తింపజేయాలని, పొరుగు సేవల సిబ్బంది సర్వీసులను క్రమబద్ధీకరించాలని, కరువు భత్యం బకాయిలను వెంటనే విడుదల చేయాలని డిమాండ్ చేసారు. ఖాళీగా ఉన్న పోస్టులను తక్షణం భర్తీ చేయాలని అన్నారు. ఈనెల 15 నుంచి 22వ తేదీ వరకూ సమస్యల పరిష్కారాన్ని కోరుతూ వివిధ స్థాయిల్లో ఆందోళన కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో డివిజన్‌లోని వివిధ సంఘాల నేతలు పాల్గొన్నారు.

విద్యుత్ ఉద్యోగుల డిమాండ్లను నెరవేర్చాలి

శంఖవరం: విద్యుత్ ఉద్యోగుల న్యాయపరమైన డిమాండ్లను పరిష్కరించాలని జగ్గంపేట డివిజన్ జేఏసీ కన్వీనర్ ఎస్ఎస్ నాయుడు అన్నారు. ఈ సందర్భంగా మంగళవారం స్థానిక విద్యుత్ సబ్‌స్టేషన్ ఆవరణలో నల్లబ్యాడ్జీలతో నిరసన తెలియజేశారు. గ్రేడ్ 2 జేఎల్ఎంలను, కాంట్రాక్ట్ ఉద్యోగులను రెగ్యులర్ చేయడంతోపాటు పెన్షన్ సౌకర్యం కల్పించాలన్నారు. ఈ కార్యక్రమంలో జేఈ భగతి కుమార్, లైన్‌మెన్లు పాల్గొన్నారు.

విద్యుదాఘాతానికి గురై ఎలక్ట్రీషియన్ మృతి



బర్ల సోమరాజు

అన్నవరం: విద్యుదాఘాతానికి గురై స్థానిక ప్రైవేట్ ఎలక్ట్రీషియన్ బర్ల సోమరాజు (40) మంగళవారం మధ్యాహ్నం మృతి చెందారు. అతనికి తల్లిదండ్రులతో బాటు భార్య, కుమారుడు, కుమార్తె ఉన్నారు. స్థానిక పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం రాజరాజేశ్వరి లాడ్జి వెనుక గల లేఅవుట్‌లోని ఇళ్లకు కొద్దిరోజులుగా సోమరాజు విద్యుత్ వైరింగ్ పనులు చేస్తున్నాడు. మంగళవారం మధ్యాహ్నం ఓ ఇంటి నుంచి సర్వీస్ లైన్‌ను విద్యుత్ స్తంభానికి కట్టేందుకు నిచ్చెన వేసుకుని ఎక్కుతుండగా సమీపంలో ఉన్న 11కేవీ విద్యుత్ తీగలు తగిలి విద్యుదాఘాతానికి గురై సిమెంట్ రోడ్డుమీద పడిపోవడంతో తలకు దెబ్బ తగిలి అక్కడికక్కడే మృతి చెందాడు. మృతదేహాన్ని ప్రత్తిపాడు ఆసుపత్రికి పోస్టుమార్టం కోసం తరలించారు. ఈ ఘటనపై అన్నవరం ఎస్సై శ్రీహరిబాబు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. సోమరాజు మృతితో ఆయన కుటుంబ సభ్యులు రోదిస్తున్న తీరు అందరినీ కలిచివేసింది.

చిరుధాన్యాల సాగు లాభదాయకం



చిరుధాన్యాల సాగుపై రైతులకు అవగాహన కల్పిస్తున్న డిస్ట్రిక్ట్ రిసోర్స్ సెంటర్ ఏడీఏ బుల్లిబాబు

తుని రూరల్: మార్కెట్ అవసరాలకు అనువుగా చిరుధాన్యాలు పండించడం లాభదాయకమని, ప్రోత్సాహకంగా అందించే విత్తనాలు, ఎరువులు, తదితర రాయితీలను రైతులు సద్వినియోగం చేసుకోవాలని డిస్ట్రిక్ట్ రిసోర్స్ సెంటర్ (పెద్దాపురం) వ్యవసాయ సహాయ సంచాలకులు సుంకర బుల్లిబాబు అన్నారు. మంగళవారం తుని మండలం వి.కొత్తూరులో ఏఓ బి.అశోక్‌కుమార్ ఆధ్వర్యంలో చిరుధాన్యాలు సాగు, ప్రయోజనాలపై జరిగిన అవగాహన సదస్సులో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఇప్పుడున్న వాతావరణం, ప్రజల ఆరోగ్య పరిస్థితుల్లో చిరుధాన్యాల వాడకం అధికమయ్యిందన్నారు. బహిరంగ మార్కెట్లో చిరుధాన్యాలకు పెరుగుతున్న డిమాండ్‌ను దృష్టిలో ఉంచుకుని రైతులు రాగులు, జొన్నలు, కొర్రలు, సామలు, గంట్లు తదితర పంటలను విస్తృతంగా పండించాలన్నారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు 50 శాతం రాయితీపై విత్తనాలు, పురుగు మందులను ఇస్తున్నట్టు తెలిపారు. చిరుధాన్యాల పండించే పద్ధతులు, నీటి యాజమాన్యం, కలుపు నివారణ తదితర అంశాలపై అవగాహన కల్పించారు. తాండవ సుగర్స్ మాజీ చైర్మన్ సుర్ల లోవరాజు, ఏఈఓ దైవప్రసాద్, వీఏఏలు జ్యోతి, అన్నపూర్ణ, శంకర్, రాంప్రసాద్, రైతులు పాల్గొన్నారు.

ఆయిల్ చోరీ కేసులో నలుగురి అరెస్టు

తొండంగి: రావికంపాడు శివారులో ఐఓసీఎల్ పైపులైన్ నుంచి ఆయిల్ చోరీ చేసేందుకు ప్రయత్నించిన కేసులో నలుగురిని అరెస్టు చేసినట్టు తొండంగి ఎస్సై జగన్మోహన్‌రావు మంగళవారం తెలిపారు. ఆయన తెలిపిన వివరాల ప్రకారం ఆగస్టు 16న రాత్రి రావికంపాడు శివారులో ఐఓసీఎల్ పైపులైన్ నుంచి ఆయిల్‌ను చోరీ చేసేందుకు కొందరు ప్రయత్నిస్తుండగా సిబ్బంది వాహనం అటుగా వెళ్తూ గుర్తించారు. ఇంతలో చోరీ చేసేందుకు వచ్చినవారంతా పారిపోగా ఐఓసీఎల్ సిబ్బంది తొండంగి పోలీసులకు ఫిర్యాదు చేసారు. ఎస్సై కేసు నమోదు చేసి దర్యాప్తు చేసారు. తుని రూరల్ సీఐ చెన్న కేశవరావు ఆధ్వర్యంలో దర్యాప్తు చేశారు. ఈ కేసుకు సంబంధించి కాకినాడ వద్ద వాకలపూడికి చెందిన చెక్కా శంకర్, జగన్నాథపురానికి చెందిన రచ్చా బంగ్రరాజు, ఉప్పలంకకు చెందిన కర్రి కేశవ, రౌతులపూడి మండలం పల్లపు చామవరానికి చెందిన దడాల ఆంజనేయులును అరెస్టు చేశామన్నారు. వీరిలో శంకర్, బంగారరాజుపై కాకినాడ సర్పవరం, ఇంద్రపాలెం, పోర్ట్ పోలీస్‌స్టేషన్, కరప పోలీస్‌స్టేషన్లలో ఆయిల్ చోరీ కేసులున్నాయని తెలిపారు.

మహిళలు ఆర్థిక స్వావలంబన సాధించాలి

కోటనందూరు: కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ఇస్తున్న ప్రోత్సాహాన్ని సద్వినియోగం చేసుకొని మహిళలు ఆర్థిక స్వావలంబన సాధించాలని మహిళా సమాఖ్య డీపీఎం వీబీఆర్ రాయ్ అన్నారు. స్థానిక మండల మహిళా సమాఖ్యలో ఏపీఎం సూర్యకుమారి అధ్యక్షతన ఎంఎస్ఎంఈలపై చిన్న, మధ్య తరగతి వ్యాపారాలు చేస్తున్న మహిళలకు మంగళవారం వర్క్‌షాపు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ చిన్న, మధ్య తరగతి వ్యాపారాలు చేస్తున్న మహిళలంతా కేంద్ర ప్రభుత్వం అందుబాటులోకి తీసుకొచ్చిన ఉద్యమ్ రిజిస్ట్రేషన్ చేయించుకోవాలన్నారు. ఉద్యమ్ రిజిస్ట్రేషన్ ద్వారా వ్యాపారులకు ప్రభుత్వం గుర్తింపు ధ్రువపత్రం, బ్యాంకు రుణం, వడ్డీపై రాయితీ తదితర ప్రయోజనాలు పొందవచ్చన్నారు. కోటనందూరు మండలం నుంచి 112 మంది వ్యాపారులు రిజిస్ట్రేషన్ చేయించుకునేందుకు ముందుకొచ్చారని డీపీఎం తెలిపారు. ఈ కార్యక్రమంలో ఇండస్ట్రీ ప్రమోషన్ ఆఫీసర్ ఎస్ సందీప్, ఏపీఎం విజయలక్ష్మి, మహిళా సమాఖ్య సిబ్బంది పాల్గొన్నారు.

మల్లవరం నుంచి 9 మంది ఉద్యోగాలకు ఎంపిక

గోకవరం: మల్లవరం గ్రామం నుంచి ఇటీవల విడుదలైన డీఎస్సీ ఫలితాల్లో తొమ్మిది మంది ఉపాధ్యాయులుగా ఎంపికయ్యారు. వీరిలో ఏడుగురు ఎస్జీటీ సాధించారు. స్కూల్ అసిస్టెంట్, వ్యాయామ ఉపాధ్యాయ పోస్టులు ఇద్దరు సాధించారు. పల్లెల వీరలక్ష్మి స్కూల్ అసిస్టెంట్ ఇంగ్లీష్, మెరిసే సూర్యం పీఈటీ, ఆడిదం సూరిబాబు, గంటా వీరవిష్ణు, గోకాడ గౌరీదేవి, పడాల రమేష్, ఈడుగుల రాజబాబు, దిమ్మితి శామ్యూల్‌రాజు, మండపాక రాజేశ్వరి సెకండ్ గ్రేడ్ ఉపాధ్యాయ పోస్టులు సాధించారు. గ్రామం నుంచి తొమ్మిది మంది ఉపాధ్యాయ పోస్టులకు ఎంపిక కావడంపై స్థానిక ప్రజాప్రతినిధులు, ప్రజలు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

సమస్యలపై చర్చ

జగ్గంపేట: మండల పరిషత్ సర్వ సభ్య సమావేశం మంగళవారం జగ్గంపేట ఎంపీపీ అత్తులూరి నాగబాబు అధ్యక్షతన నిర్వహించారు. ఈ సమావేశంలో వివిధ శాఖలకు చెందిన అభివృద్ధి పనులపై సమీక్ష నిర్వహించి, సమస్యలపై చర్చించారు. మండలంలోని సమస్యలు పరిష్కారంపై చర్చించారు. ఈ కార్యక్రమంలో జెడ్పీటీసీ ఒమ్మి బింధుమాధవి, ఎంపీడీఓ చంద్రశేఖర్ పాల్గొన్నారు.

పూర్వవిద్యార్థుల ఆత్మీయ కలయిక



లింగంపర్తిలో కలుసుకున్న పూర్వవిద్యార్థులు

ఏలేశ్వరం: వారంతా కలిసి చదువుకొని ఇరవైఏళ్లు అయ్యింది. లింగంపర్తి జెడ్పీఉన్నత పాఠశాలలో మంగళవారం నిర్వహించిన పూర్వవిద్యార్థుల ఆత్మీయ కలయిక కార్యక్రమంలో వీరంతా కలుసుకుని అప్పటి జ్ఞాపకాలను నెమరవేసుకున్నారు. బాల్యం నాటి రోజులను గుర్తుతెచ్చుకుని పులకరించిపోయారు. ఒకరికొకరు ఆత్మీయంగా పలకరించుకుని తమ కుటుంబ సభ్యుల వివరాలు అడిగి తెలుసుకున్నారు. 2004–05 ఏడాదిలో వారంతా పదో తరగతి చదువుకున్నారు. విద్యనభ్యసించిన పాఠశాల భవనంలో కలియతిరిగి బాల్యంలోని మధుర జ్ఞాపకలను గుర్తు చేసుకుని మురిసిపోయారు. అనంతరం వీరికి విద్యాబుద్ధులు నేర్పిన ఉపాధ్యాయులను సన్మానించారు. ఈ కార్యక్రమంలో హెచ్ఎం లక్ష్మణరావు, ఉపాధ్యాయులు సుభాకరరావు, మల్లికార్జునరావు, మురళి, సురేష్‌నాయుడు, వెంకటరమణ, లక్ష్మీనారాయణ, రామకృష్ణ, తోటకూర రామకృష్ణ, వాసు, విద్యార్థులు పాల్గొన్నారు.

ఓజోన్ పొర పరిరక్షణ అందరి బాధ్యత



ప్రిన్సిపాల్ సునీత

ఏలేశ్వరం: ఓజోన్ పొర పరిరక్షణ అందరి బాధ్యతని ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ డి.సునీత అన్నారు. స్థానిక ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో మంగళవారం ప్రపంచ ఓజోన్ పొర పరిరక్షణ దినోత్సవం ఘనంగా నిర్వహించారు. రసాయన శాస్త్ర విభాగ అధ్యాపకుడు ఎస్.రాజేష్ ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ కార్యక్రమంలో ప్రిన్సిపాల్ డిసునీత ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా ప్రిన్సిపాల్ మాట్లాడుతూ ఓజోన్ పొర భూమికి సుమారు 15 నుంచి 35 కిలోమీటర్ల దూరం ఉంటుందన్నారు. సూర్యుని నుంచి వచ్చే ప్రమాదకరమైన అతినీలలోహిత కిరణాలను గ్రహించి జీవులను కాపాడే రక్షణ కవచంగా ఉంటుందన్నారు. ఓజోన్ పొర క్షీణించడం ద్వారా చర్మ, కంటి సమస్యలు వస్తాయన్నారు. కార్యక్రమంలో వైస్‌ప్రిన్సిపాల్ వెంకటేశ్వరరావు, ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం ఆఫీసర్ ప్రగడ ప్రయాగమూర్తి, అధ్యాపకులు మదీనా, శివప్రసాద్, లక్ష్మీ, వీరభద్రరావు బంగారాజు పాల్గొన్నారు.



సమావేశంలో పాల్గొన్న అధ్యాపకులు, విద్యార్థులు

పర్యావరణ పరిరక్షణ అందరి బాధ్యత

తొండంగి: పర్యావరణాన్ని కాపాడుకోవాల్సిన బాధ్యత అందరిపై ఉందని పెరుమాళ్లపురం జెడ్పీ హైస్కూలు ప్రధానోపాధ్యాయుడు చాట్రాతి వీవీ సత్యనారాయణమూర్తి అన్నారు. అంతర్జాతీయ ఓజోన్ పొర పరిరక్షణ దినోత్సవం సందర్భంగా పెరుమాళ్లపురం జెడ్పీ హైస్కూల్లో విద్యార్థులతో కలిసి మొక్కలు నాటారు. పర్యావరణాన్ని కాపాడుకోవాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉందన్నారు. పర్యావరణ కాలుష్యంతో ఓజోన్ పొర దెబ్బతింటుదన్నారు. దీనివల్ల భూతాపం పెరిగి ఉష్ణోగ్రతలు పెరుగుతున్నాయన్నారు. కాలుష్యాన్ని తగ్గించేందుకు మొక్కలు నాటి వృక్ష సంపదను పెంచాలన్నారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు విద్యార్థులు పాల్గొన్నారు.



తొండంగి మండలం పెరుమాళ్లపురం జెడ్పీ హైస్కూల్లో మొక్కలు నాటుతున్న విద్యార్థులు

రాష్ట్రస్థాయి యోగా పోటీలకు పలువురి ఎంపిక

తుని: పిఠాపురంలో ఈ నెల 14న నిర్వహించిన జిల్లాస్థాయి యోగా పోటీల్లో తుని పట్టణానికి చెందిన పలువురు యోగా సాధకులు రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికయ్యారు. తుని పట్టణానికి చెందిన రెడ్డి లక్ష్మణ, అత్తి చిట్టిపార్వతి, జి.హర్షవర్ధిని, శ్రీనివాసరాజు గోల్డ్, నానాజీ, గణేష్‌కుమార్ రజత, వీరన్న, పాండురంగా కాంస్య పతకాలు సాధించారు. విజేతలు వచ్చే నెలలో ఏపీ స్టేట్ యోగా అసోసియేషన్ ఆధ్వర్యంలో విశాఖపట్నంలో నిర్వహించనున్న రాష్ట్రస్థాయి పోటీల్లో పాల్గొంటారని యోగా గురువు దేవత జ్యోతి తెలిపారు. మంగళవారం స్థానిక మున్సిపల్ కార్యాలయంలో రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికైన యోగా సాధకులను మున్సిపల్ చైర్‌పర్సన్ నార్ల భువనసుందరి, మున్సిపల్ కమిషనర్ వెంకటరావు తదితరులు అభినందించారు.



తునిలో యోగా సాధకులను అభినందిస్తున్న మున్సిపల్ చైర్‌పర్సన్ భువనసుందరి

విజేతలైన విద్యార్థినులకు బహుమతులు

రౌతులపూడి: బాలికా దినోత్సవం సందర్భంగా స్థానిక జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలల విద్యార్థినులకు మండలస్థాయి పోటీలు నిర్వహించారు. వివిధ విభాగాల్లో నిర్వహించిన ఈ పోటీల్లో వ్యాసరచనలో రౌతులపూడి జెడ్పీ హైస్కూల్‌కు చెందిన వి.శశిప్రవీణ ప్రథమస్థానంలో, పెయింటింగ్ విభాగంలో ఎస్.సాయినాగదేవి ప్రథమ స్థానాన్ని కైవసం చేసుకున్నారు. వక్తృత్వం పోటీల్లో రౌతులపూడి జెడ్పీ హైస్కూల్‌కు చెందిన డి.వర్ష, కె.సాయిఆశిత ప్రథమ శ్రేణిలో నిలిచారు. ఈ పోటీల్లో గెలుపొందిన విద్యార్థులను స్ఫూర్తిగా తీసుకుని ప్రతి విద్యార్థి అన్ని విభాగాల్లో మంచి ప్రావీణ్యం పొందాలని ఎంఈఓ కె.సతీష్‌బాబు సూచించారు.

గళ్లా కుటుంబానికి ముదునూరి పరామర్శ

ప్రత్తిపాడు రూరల్: ధర్మవరం గ్రామానికి చెందిన గళ్లా సూరిబాబు కుటుంబాన్ని మంగళవారం వైఎస్సార్ సీపీ నరసాపురం పార్లమెంటరీ పరిశీలకుడు ముదునూరి మురళీకృష్ణంరాజు పరామర్శించారు. సూరిబాబు భార్య ఇటీవల అనారోగ్యానికి గురై కాకినాడలోని ప్రైవేటు హాస్పిటల్లో చికిత్స పొందుతున్నారు. ఆమెను మురళీకృష్ణంరాజు పరామర్శించి ఆరోగ్య పరిస్థితిని అడిగి తెలుసుకున్నారు. మెరుగైన వైద్యం అందించాలని ఆయన వైద్యులకు సూచించారు. బాధిత కుటుంబానికి అండగా ఉంటానని భరోసా ఇచ్చారు. ఈ కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

ప్రజా సంక్షేమమే వైఎస్సార్ సీపీ లక్ష్యం



కిర్లంపూడిలో ముద్రగడ గిరిబాబును కలిసిన దళిత సంఘ నాయకులు

కిర్లంపూడి: ప్రజా సంక్షేమమే వైఎస్సార్ సీపీ ప్రధాన లక్ష్యంగా పనిచేస్తుందని ఆపార్టీ ప్రత్తిపాడు నియోజకవర్గం కో ఆర్డినేటర్ ముద్రగడ గిరిబాబు తెలిపారు. కాకినాడ జిల్లాకు చెందిన పలువురు దళిత సంఘ నాయకులు కిర్లంపూడిలోని వైఎస్సార్ సీపీ సీనియర్ నాయకుడు, పీఏసీ సభ్యుడు ముద్రగడ పద్మనాభం నివాసంలో గిరిబాబును మంగళవారం మర్యాదపూర్వకంగా కలిశారు. శంఖవరం మండలం కత్తిపూడిలో త్వరలో నిర్వహించనున్న దళిత ప్రజా సమితి వార్షికోత్సవానికి ముఖ్యఅతిథిగా హాజరుకావాలని ఆయనను ఆహ్వానించారు. ఈ సందర్భంగా గిరిబాబు మాట్లాడుతూ వైఎస్సార్ సీపీకి వెన్నెముకగా నిలబడుతున్న దళిత వర్గానికి పార్టీ ఎల్లప్పుడు అధిక ప్రాధాన్యత ఇస్తుందన్నారు. ఈ కార్యక్రమంలో దళిత ప్రజా సమితి రాష్ట్ర ప్రధాన కార్యదర్శి గునపర్తి అపురూప్, కాకినాడ జిల్లా అధ్యక్షుడు బత్తిన తాతాజీ, మడికి శివ, గునపర్తి రాఘవ, తండు సుబ్బరాజు పాల్గొన్నారు.

కరాటే పోటీల్లో రాణించిన గురుకుల విద్యార్థులు



రాష్ట్రస్థాయిలో పతకాలు సాధించిన విద్యార్థులు



జూడో పోటీలకు ఎంపికైన విద్యార్థులు

ఏలేశ్వరం: అమలాపురంలో ఇటీవల నిర్వహించిన కరాటే పోటీల్లో సాంఘిక సంక్షేమ శాఖ బాలికల గురుకుల పాఠశాల, కళాశాల విద్యార్థులు రాణించారు. రాష్ట్రస్థాయి పోటీల్లో రాణించి 12 మంది బంగారు, 15 మంది రజత పతకాలు సాధించినట్టు ప్రిన్సిపాల్ చంద్రశారద తెలిపారు. వీరిలో బి.వరలక్ష్మి, సీహెచ్ మమత రాష్ట్రస్థాయి జూడో పోటీలకు ఎంపికయ్యారు. వీరిని పలువురు అభినందించారు.

అల్లుకున్న ప్రమాదం



పాలెం కాలనీలో విద్యుత్ స్తంభానికి అల్లుకున్న పొదలు, తుప్పలు



పాలెం కాలనీలో ట్రాన్స్‌ఫార్మర్‌కు చుట్టేసిన పొదలు

కిర్లంపూడి: మండల పరిధి పాలెం కాలనీలో పలు ప్రదేశాల్లోని ట్రాన్స్‌ఫార్మర్లకు, విద్యుత్ స్తంభాలకు పొదలు దట్టంగా అల్లుకున్నాయి. ఇటీవల ఏకధాటిగా వర్షాలు కురవడంతో విద్యుత్ స్తంభాలకు అల్లుకున్న పొదలు, తుప్పల కారణంగా ఎప్పుడు ఏ ప్రమాదం సంభవిస్తుందోనని గ్రామస్తులు భయాందోళన వ్యక్తం చేస్తున్నారు. దీనిపై విద్యుత్ అధికారులు స్పందించి స్తంభాలకు అలుముకున్న పొదలను, తుప్పలను తొలగించాలని గ్రామస్తులు కోరుతున్నారు.

తాండవ నదిలో చెత్త తొలగింపు

సాక్షి ఇంపాక్ట్

కోటనందూరు: స్థానిక తాండవ నదిలో చెత్తను పంచాయతీ అధికారులు మంగళవారం తొలగించారు. పడకేసిన పారిశుధ్యం పేరుతో సోమవారం సాక్షిలో ప్రచురితమైన కథనంపై పంచాయతీ అధికారులు స్పందించారు. క్లాప్‌మిత్రలు గ్రామంలో సేకరించి తాండవనదిలో పడేసిన చెత్తను పొక్లెయిన్ సహాయంతో తొలగించారు. ఇకపై చెత్తను నదిలో వేయకుండా జాగ్రత్తలు తీసుకుంటామని పంచాయతీ అధికారులు తెలిపారు. కాకరాపల్లిలో డ్రెయిన్‌లో పేరుకుపోయిన పూడికను పంచాయతీ సిబ్బంది తొలగించారు.



కోటనందూరు తాండవ నదిలో పేరుకుపోయిన చెత్తను తొలగిస్తున్న పొక్లెయిన్